క్లుప్తంగా

కంటి వైద్య శిబిరంలో 280 మందికి పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ గీత

సామర్లకోట: స్థానిక మార్వాడీ కుటుంబ సభ్యులు ఆదివారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ సత్రంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 280 మంది పరీక్షలు చేయించుకున్నారు. గురుపూర్ణిమిని పురస్కరించుకుని తండ్రి భవర్‌లాల్ డి జైన్ జ్ఞాపకార్థం వారి కుమారులు సుమిత్‌కుమార్ జైన్, అమిత్ కుమార్ జైన్‌లు ఈ శిబిరాన్ని నిర్వహిస్తుంటారు. మాజీ కౌన్సిలర్ కాపుగంటి పైడి రత్నం, ఆర్యవైశ్య సేవా సంఘం ప్రతినిధి ఊర సత్యనారాయణ నిర్వాహకులను అభినందించారు. కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో డాక్టరు గీత కంటి పరీక్షలు నిర్వహించారు. 40 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు శిబిరం మేనేజరు సత్యనారాయణ తెలిపారు.

నేడు పిఠాపురంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

పిఠాపురం: స్థానిక రథాలపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలస్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లాలో వివిధ శాఖలకు చెందిన దిగువ స్థాయి, డివిజన్, నియోజకవర్గ స్థాయి అధికారులు ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ యథావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

ఘనంగా చండీహోమం



మరిడమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లి ఆలయంలో ఆదివారం చండీహోమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, వేద పండితులు చిట్టెం హరి గోపాలశర్మల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పీఈ చిన్నాయపాలెం రైల్వేగేటు మూసివేత

తొండంగి: రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా మండలంలోని పి.ఇ.చిన్నాయపాలెం రైల్వే గేటును ఈ నెల 24వ తేదీ వరకూ మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం గేటును మూసివేశారు. కొద్దిరోజుల క్రితం గోపాలపట్నం రైల్వే గేటు మూసి వేయడంతో ఆ మార్గంలో వెళ్లే వారంతా పి.ఇ.చిన్నాయపాలెం గేటు ద్వారా రాకపోకలు సాగించారు. కాగా ఇప్పుడు చిన్నాయపాలెం రైల్వే గేటు మూతపడటంతో గ్రామస్తులు ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం రైల్వే గేటు మీదుగా రాకపోకలు సాగించాలి.



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లోని శిరిడీ సాయిబాబాను దర్శించుకున్న భక్తులు



పులిమేరు యోగా కేంద్రంలో వివేకానందుడి విగ్రహానికి మొక్కుతున్న భక్తులు



పిఠాపురంలో దత్త హోమం నిర్వహిస్తున్న భక్తులు



పాదగయ క్షేత్రంలో దత్తాత్రేయస్వామివారు

కన్నులపండువగా గురుపూజోత్సవం

- శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానానికి భక్తుల తాకిడి
- సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: దత్తాత్రేయుని అవతారాల్లో ఒకటైన శ్రీపాదుని జన్మస్థలం పిఠాపురంలో ఆదివారం గురుపూజోత్సవం కన్నులపండువగా జరిగింది. గురుపౌర్ణమిని పురస్కరించుకుని నియోజకవర్గంలోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం మహారాష్ట్ర నుంచి వచ్చిన వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాదగయ క్షేత్రంలో దత్తాత్రేయస్వామికి పండితులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పిఠాపురం, గొల్లప్రోలు మండలాలతో పాటు పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గొల్లప్రోలు మండలం చేబ్రోలు షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండితులు బాబావారికి కాకడ హారతులు, పంచామృతాభిషేకాలు జరిపారు. అనంతరం మహిళా భక్తులు సామూహిక సాయిసత్యవ్రతాలు నిర్వహించారు. బాబాకు ఉదయం పల్లకీసేవ, సాయంత్రం పవలింపు సేవ, రాత్రికి సాయినామ సంకీర్తన నిర్వహించారు. సాయిసేవక్ ఎస్. శ్రీరామ చంద్రమూర్తి, ములుకూరి పద్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గొల్లప్రోలు శ్రీవిజ్ఞాన బ్రహ్మానంద ఆశ్రమం (లలితా పీఠం)లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక గోపాల్‌బాబా ఆశ్రమంలో గురుపౌర్ణమి సందర్భంగా భారీ అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.



గొల్లప్రోలు శ్రీవిజ్ఞాన బ్రహ్మానంద ఆశ్రమంలో గురుపూజోత్సవం



చేబ్రోలులో సామూహిక సాయి సత్యవ్రతాలు



పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ సంస్థానంలో పూజలు చేస్తున్న భక్తులు

పూజ్య గురు దత్తుని సేవలో..

- పంచారామ క్షేత్రంలోని గురు దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు
- ఆయా గ్రామాల్లో దేవతా మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, భక్తులకు అన్నదానాలు



పంచారామ క్షేత్రంలోని దత్తాత్రేయ స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు



పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో ఆదివారం ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఉప ఆలయంలోని దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరించారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు. దీనిలో భాగంగా ఆలయంలో దేవేరి బాలాత్రిపుర సుందరిదేవికి శ్రీచక్ర నవావరణార్చన చేశారు. ఈ మేరకు ఆలయంలోని చాళుక్య కుమారామభీమేశ్వర స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

సామర్లకోటలో..

స్థానిక స్టేషన్ సెంటర్‌లోని శిరిడీ సాయి ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. వందలాది భక్తులు బాబాను దర్శించుకున్నారు. స్థానిక రైల్వే కల్యాణ మండపంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దన్నాల అప్పారావు సుమారు పది వేల మందికి అన్నదాన ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి గంద్రోతుల సత్యనారాయణ, కోశాధికారి డి.రాజబాబు, కమిటీ నాయకులు సేపెని సూరిబాబు, కొప్పన రాంబాబు, ఎం చిరంజీవిరావు తదితరులు సేవలందించారు. అలాగే పిఠాపురం రోడ్డులోని సాయిబాబా ఆలయంలోను, కొట్లమ్మ చెరువు వద్ద సాయిబాబా ఆలయంలోను గురు పౌర్ణమి ఉత్సవాన్ని నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాల స్వామి, సాయిబాబా, ఉప్పాడలో వేంకటేశ్వర స్వామి, ఐశ్వర్యసాయి, సాయిబాబా, కొమరగిరిలో సాయిబాబా, రమణక్కపేటలో విజయజనార్దన స్వామి ఆలయాలకు ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. పలు గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

పులిమేరులో..

పెద్దాపురం: మండలంలోని పులిమేరు అభయాంజనేయ యోగా శ్రమంలో యోగా గురువు మసిముక్కల రామకృష్ణ, స్థల దాత తుమ్మల అచ్యుతరామయ్య, ఒమ్మంగి వీఆర్ఓ షేక్ ఇస్మాయేల్‌ల ఆధ్వర్యంలో గురు పూజోత్సవాలు నిర్వహించారు. తొలుత వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి వేడుకలును నిర్వహించారు. యోగాశ్రమానికి విచ్చేసిన వారికి మొలకలు, ఆయుర్వేద ఫలాలు అల్పాహారంగా అందజేసి ఉచితంగా పులిహోర పంపిణీ చేశారు. యోగా గురువు, స్థలదాతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల మల్లిక్, తోట శేషయ్య, పూసల వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

హరిశ్చంద్ర పరిశోధన గ్రంథం ఆవిష్కరణ



హరిశ్చంద్ర పుస్తకావిష్కరణ చేస్తున్న వక్తలు

పెద్దాపురం: స్థానిక మహారాణి కళాశాల విశ్రాంత తెలుగు ఆచార్యుడు జోస్యుల కృష్ణబాబు రచించిన హరిశ్చంద్ర నాటక పరిశోధన గ్రంథాన్ని ఆదివారం సాయంత్రం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అధ్యక్షతన జరిగింది. వక్తలు మాట్లాడుతూ రచయిత కృష్ణబాబు సేవలను కొనియాడారు. తొలుత మధునాపంతుల సత్యనారాయణ పుస్తకాన్ని ఆవిష్కరించగా జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం, పేపకాయల ప్రసాద్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి చందనోత్సవం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి (శ్రీవారి)కి ఆదిఆరం వైభవంగా చందనోత్సవం నిర్వహించారు. పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి చందనోత్సవం, విశేష పూజలు నిర్వహించారు. వందలాది మంది స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గిరిప్రదక్షణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శాకంబరిగా నూకాలమ్మ తల్లి



శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు

పెద్దాపురం : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కాండ్రకోట నూకాలమ్మ తల్లి ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణ, ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

సేవలే లక్ష్యంగా లయన్స్ క్లబ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్

సామర్లకోట: పేదల సేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఏర్పాటైందని అంతర్జాతీయ బోర్డు ట్రస్టీ వి విజయకుమార్‌రాజు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక పూర్ణా కల్యాణ మండపంలో జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వర కుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా లయన్స్ క్లబ్ కేబినెట్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా సభ్యత్వాలు రెండు వేలకు చేరడం అభినందనీయమన్నారు. పేద ప్రజలు ప్రతి విషయానికి కాకినాడ వెళ్లే అవసరం లేకుండా స్థానికంగా మంచి ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమ అధ్యక్షుడు, జిల్లా గవర్నర్ ఈశ్వరకుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి క్లబ్‌లో మొక్కలు నాటే ప్రక్రియకు ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఉపగవర్నర్లు వి కోటేశ్వరరావు, సి. శ్రీనివాసు, జిల్లా క్లబ్ సలహాదారు వింజమూరి విశేశ్వరరావు, మాజీ గవర్నర్లు డాక్టరు గోలి శ్రీరాములు, డాక్టరు బాదం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల కోసమే లెక్చర్ గ్యాలరీ

కాకినాడ క్రైం: జీజీహెచ్ ఎదురుగా రంగరాయ సెంట్రల్ లైబ్రరీని ఆనుకుని ఉన్న పారామెడికల్ లెక్చర్ గ్యాలరీని 1980 బ్యాచ్‌కి చెందిన రంగరాయ పూర్వపు విద్యార్థి, మాజీ మంత్రి, కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ గురనాథరావు అధ్యక్షత వహించారు. రూ.60 లక్షలతో ఆధునీకరించిన ఈ భవంతిని వైద్య విద్యార్థుల కోసం అందుబాటులోకి తెచ్చామని శ్రీనివాస్ అన్నారు. రంగరాయ వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆధునీకరణకు ముందుకు వచ్చి, భారీ ప్రాజెక్టును పూర్తి చేయడంలో సహకరించిన డాక్టర్ గురునాథరావు, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ వారా వెంకటరావు బృందాన్ని ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ జీఎస్ఎన్ మూర్తి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వాడ్రేవు రవి పాల్గొన్నారు.

తీరంలో అలజడి



ఉప్పాడలో కోతకు గురవుతున్న మత్స్యకార గృహాలు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో ఉప్పాడ సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. మండల వ్యాప్తంగా కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తీర గ్రామాల్లో అల్పపీడనం ప్రభావం ఎక్కువగా ఉండటంతో మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు. కాగా మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.



ఉప్పాడలో కోతకు గురవుతున్న తీరం



ఉప్పాడ తీరంలో సముద్ర గర్భంలో కలిసిన రక్షణ గోడ

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు లేవు
- రెండు శాఖల మధ్య కొరవడిన సమన్వయం



పెద్దాపురం రోడ్డులో ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



పాత పెట్రోల్ బంకు ఎదురుగా గోతులతో ఉన్న రోడ్డులో ప్రమాదకారకంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

సామర్లకోట: పెద్దాపురం-సామర్లకోట మున్సిపాలిటీల మధ్య ఆర్అండ్‌బీ రహదారి విస్తరణ జరిగి సుమారు ఏడేళ్లు గడుస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. విస్తరణ సమయంలో రోడ్డు మార్జిన్‌లోని విద్యుత్ స్తంభాలతో పాటు విద్యుత్ ట్రాన్సుఫార్మర్లను మార్చాల్సి ఉన్నా ఆ చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ప్రమాదాలపాలవుతున్నారు. స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి మఠంసెంటర్ వరకు నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటిని మార్చడానికి పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు ట్రాన్సుకోకు ఫీజు చెల్లించాల్సి ఉంది. ఇది జరగకపోవడం గమనార్హం. అలాగే ప్రమాదాల నివారణకు రహదారి మధ్య డివైడర్లను నిర్మించగా, ప్రయాణికులు చుట్టూ తిరిగి రాలేక డివైడర్లను యథేచ్ఛగా దాటేస్తూ ప్రమాదాలపాలవుతున్నారు. దీంతో పోలీసులు ఆ ఖాళీలను మూసివేశారు. పెద్దాపురం రోడ్డులో ఎస్‌బీఐ, మెహర్‌కాంప్లెక్స్ వద్ద మాత్రమే రోడ్డును క్రాస్ చేసే అవకాశం కల్పించారు.

పొంచి ఉన్న ప్రమాదం..

పెద్దాపురం-సామర్లకోట రోడ్డులో ఎస్‌బీఐ వద్ద, పాత పెట్రోలు బంకుకు ఎదురుగా ఉన్న ట్రాన్సుఫార్మర్ల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఆయా ప్రదేశాల్లో రోడ్డు ఇరుకుగా ఉండడంతో వల్ల అక్కడి ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ కూడా మున్సిపాలిటీ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు కోరుతూ అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సి ఉంది. పాత పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న రోడ్డు నిర్మించినప్పటి నుంచి గోతులతో నిండి వాహన చోదకులు గాయాలపాలవుతున్నారు. ఎన్ని పర్యాయాలు మరమ్మతు చేసినా పరిస్థితి మామూలే. ఈ సమస్య పరిష్కారానికి రోడ్డుపై నీరు డ్రైన్‌లోకి పోయేలా పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు సూచిస్తున్నారు.

ప్రమాదాలు నివారించాలి...

పెద్దాపురం రోడ్డులో ప్రమాద బరితంగా ఉన్న ట్రాన్సుఫార్మర్లను మార్చాలి. ప్రసన్నాంజనేయస్వామి ఆలయ సమీపంలో బాలికల పాఠశాల రోడ్డుకు మధ్యలో డివైడర్ పూర్తి చేయాలి. పాత పెట్రోలు బంకు వద్ద గోతులతో ఉన్న రహదారిని సీసీ రోడ్డుగా మార్చాలి.

– నేతల హరిబాబు, కౌన్సిలర్, సామర్లకోట.

రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు..

మున్సిపాలిటీ పరిధిలోని ట్రాన్సుఫార్మర్లను మార్చాలని కమిషనర్ అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ చేసి రెండు రోజుల క్రితం ఇచ్చారు. దీనికి అంచనాలు తయారు చేయడానికి హెడ్ ఆఫీసుకు పంపుతాం. ఈ ప్రక్రియ 15 రోజులు పడుతుంది. ఈ మేరకు ట్రాన్సుఫార్మర్ల మార్పు కోరుతూ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి మఠం సెంటర్ వరకు ఉన్న నాలుగు ట్రాన్సుఫార్మర్ల మార్పునకు సుమారు రూ.20 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది.

– కిరణ్, ట్రాన్స్‌కో ఏడీఈ, సామర్లకోట.